అంగన్‌వాడీ టీచర్ల నిరసన



అచ్చంపేటలో



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ రూరల్: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు చేపట్టిన నిరవధిక సమ్మె ఐదో రోజు శుక్రవారం కొనసాగింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. సీఐటీయూ నాయకులు ఆర్ శ్రీనివాసులు జిల్లా రామయ్య జయమ్మ అంజమ్మ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: అంగన్‌వాడీ నిరవధిక సమ్మెలో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి వెళ్తుండగా అచ్చంపేట ప్రధాన రహదారిలో ఉన్న రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్ నివాసం వద్ద ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజును కలిశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రభుత్వ విప్‌కు అందజేశారు. ఐసీడీఎస్ అధికారులకు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు ఇవ్వాలని కోరగా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఇచ్చే ప్రసక్తే లేదన కరాకండిగా చెప్పారు.

కల్వకుర్తి రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు మద్దతు తెలిపారు. అనంతరం వైస్ ఎంపీపీ గోవర్ధన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బాలస్వామి, బాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మాసమ్మ, జానకమ్మ, జయమ్మ, యాదమ్మ ఉన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు కేవీపీ జిల్లా అధ్యక్షుడు కాశన్న మద్దతు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీకి తరలివెళ్లారు. సుచిత్ర, శాంతమ్మ, విజయ, అలివేలు, భారతి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ



తాడూరులో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ

తాడూర్: మండల కేంద్రానికి చెందిన వస్పరి మల్లేష్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం బాధితుడికి మండల కేంద్రంలో ఎమ్మెల్సీ కె.దామోదర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు యార కోటీశ్వర్, సంద మల్లయ్య, పర్వతాలు, వెంకటయ్య పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎంపీ రాములు

కల్వకుర్తి: మండలంలోని ముకురాలకు చెందిన బుగ్గారెడ్డికి రూ.56వేలు, గుండూరుకు చెందిన చిట్టమ్మకు రూ.60వేలు, కడ్తాల్‌కు చెందిన శారదకు రూ.24వేలు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరయ్యాయి. శుక్రవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ రాములు బాధితులకు చెక్కు అందజేశారు.

క్లుప్తంగా

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల పరామర్శ



నాగర్‌కర్నూల్ రూరల్: మున్ననూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శుక్రవారం పరామర్శించారు. అస్వస్థలకు గల కారణాలను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారా సింగ్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రవి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



వెల్దండ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రిన్సిపాల్ పుష్పలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర విద్యార్థులకు వెల్‌కం పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

ఎస్‌ఐగా ఎంపికైన అభ్యర్థికి సన్మానం

అమ్రాబాద్: మండల కేంద్రానికి చెందిన ఎండీ షఫీల్ ఆగస్టు నెలలో వెలువడిన ఫలితాలలో ఏఆర్‌ఎస్‌గా సెలెక్ట్ అయ్యాడు. ఈ మేరకు మసీద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జామా మసీద్‌లో సన్మానించారు. కార్యక్రమంలో అమ్రాబాద్ సర్పంచ్ శారద, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, చెన్నకేశవులు, నాయక్ సర్దార్, ఇస్మాయిల్ ఉన్నారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి



చారకొండ: మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలని సత్యహరిచంద్ర ఫౌండేషన్ చైర్మన్ జూపల్లి రాములు యాదవ్ అన్నారు. మండలంలోని జూపల్లిలో మూడు నెలల పాటు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్‌బీఆర్ భవన్‌లో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చారు. శుక్రవారం ముగింపు సందర్భంగా చైర్మన్ రాములు యాదవ్‌ను సన్మానించారు. అనంతరం కుట్టు మిషన్ శిక్షకులు సఫీయాకు రూ.10 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు ఉన్నారు.

దళితులకు ఉచిత కరెంట్ ఇవ్వాలి



తెలకపల్లి: దళితులకు 300 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ సరఫరా చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిపేట భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కార్వంగ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన నందిపేటలో ఉచిత కరెంట్‌పై కేవీపీఎస్ నాయకులు సర్వే నిర్వహించారు. ఈ నెల 10 నుంచి 25 వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. 342 జీఓ ప్రకారం 101 యూనిట్ల ఉచిత కరెంట్ ఇవ్వాల్సి ఉన్న విద్యుత్ అధికారులు అధికారులు బలవంతంగా కరెంట్ బిల్‌లు వసులు చేస్తున్నారన్నారు. సత్యనారాయణ, నాగరాజు, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టుకు ప్రభుత్వ విప్ అభినందన

అచ్చంపేట రూరల్: అమ్రాబాద్ మండలం మన్ననూరు గిరిజన బాలిక వసతిగృహంలో అస్వస్థతకు గురైన విద్యార్థినులను పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో ఫార్మాసిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న రాజేష్ సకాలంలో స్పందించి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ఫార్మసిస్టును అభినందించారు. గువ్వల అమల, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విముక్తి కోసమే సాయుధ పోరాటం



మన్ననూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

మన్ననూర్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసమే తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దేశ్యానాయక్ అన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సాయుధ పోరాటంలో అమరుడైన మన్ననూర్‌కు చెందిన రాములు స్థూపం వద్ద శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17 ను తెలంగాణ విలీన దినోత్సవంగా నిర్వహించుకుందామన్నారు. అంతకు ముందు గ్రామ ప్రధాన కూడళ్లలో పార్టీ నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, శంకర్, నర్సిమ్మా, సయ్యద్, నిర్మల, సైదులు, అఖిల్, రాజు, భాస్కర్, సేవ్యా నాయక్, బాలయ్య, సుల్తాన్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వామపక్ష పార్టీల కీలక పాత్ర పోషించారని సీపీఎం మండల కార్యదర్శి దశరథం అన్నారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో మోటర్ సైకిల్‌ల యాత్ర చేపట్టారు. కార్యక్రమంలో రాముడు, రంగయ్య, నాగేంద్ర, ఎల్లయ్య, వెంకటస్వామి, బాలస్వామి పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలం కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతంగ పోరాటాల వారోత్సవాల్లో భాగంగా బైకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా నాయకుడు ఈశ్వర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో హనుమంతు, గోపాల్, డి రవి, ఈశ్వర్, రాజు, బాలస్వామి, లింగం, అల్లన్న, తదితరులు పాల్గొన్నారు

ఎస్‌ఐలపై ఏఎస్పీకి ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని కుమ్మెరలో రైతు అల్లోజి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై విలేకరులు వార్త సేకరణ కోసం వెళ్తే ఎస్‌ఐలు దాడి చేశారని ఏఎస్పీ రామేశ్వర్‌కు జర్నలిస్టులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏఎస్పీని జర్నలిస్టులు కలిశారు. వృత్తిలో భాగంగా ఫొటోలు తీస్తున్న విలేకరిపై నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ మహేందర్‌తో పాటు బిజినేపల్లి ఎస్‌ఐ రాములు దాడికి పాల్పడి పరుషపదజాలంతో దూషించారని వివరించారు. అంతటితో ఆగకుండా పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఇబ్బందులు పెట్టారని గుర్తుచేశారు.

అంబులెన్స్‌లో ప్రసవం

నాగర్‌కర్నూల్ క్రైం: అంబులెన్స్‌లో గర్భిణీ శిశువుకు జన్మనిచ్చిన ఘటన శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద చోటుచేసుకుంది. అంబులెన్స్ సిబ్బంది వివరాల ప్రకారం తెలకపల్లి మండలం గట్టురాయపాకుల గ్రామానికి చెందిన శిరీషకు పురిటినొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. వెంటనే 108 సిబ్బంది గ్రామానికి చేరుకుని జనరల్ ఆసుపత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌లోనే ఈఎంటీ మల్లికార్జున్ పర్యవేక్షణలో గర్భిణీ శిరీష మగ శిశువుకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరిని జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ కార్మికుల గేట్ ధర్నా



కొల్లాపూర్: ఆర్టీసీ కార్మికులకు పెండింగ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘం ఆధ్వర్యంలో కార్మికులు గేట్ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం డిపో కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ 2013వ సంవత్సరం ఆర్‌పీఎస్ 50 శాతం బకాయిలు, 2017 నుంచి అమలుకావాల్సిన పేస్కేల్, 2018 తర్వాత రిటైర్డ్ అయిన కార్మికులకు అన్ని రకాల బెనిఫిట్స్‌కు సంబంధించిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటేష్, శ్రీనివాస్, బాలస్వామి తదితరులున్నారు.

కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి



మన్ననూర్: గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థుల అస్వస్థతకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, ఎంపీపీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాఠశాలలు, వసతి గృహాలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. పేద విద్యార్థులపై నిర్లక్ష్యం తగదన్నారు. వసతిగృహాలలో నిర్వహణలో లోపాలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చయ్య, సంబు శోభ, సుజాత, లింగం, కృష్ణయ్య, మధు, లోకనాథం, పాండు తదితరులు పాల్గొన్నారు.

జూపల్లి విమర్శలు హాస్యాస్పదం



కొల్లాపూర్: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్‌రావు, దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిర్వాసితులను జూపల్లి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఆయన బీఆర్‌ఎస్‌లో ఉన్నన్ని రోజులు పాలమూరు ప్రాజెక్టును పొగిడారని, ఇప్పుడు కండువా మారాక విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి పదవులు అనుభవించిన సమయంలో ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదో చెప్పాలన్నారు. సీఎం కేసీఆర్‌కు జూపల్లి బహిరంగ క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మార్కెట్ చైర్మన్ కిషన్‌నాయక్, నాయకులు కొండా సుధాకర్‌రెడ్డి, రాంచందర్ యాదవ్, బోజ్యానాయక్, కాటం జంబులయ్య, కలమూరి నిరంజన్ తదితరులున్నారు.

దిమ్మె తొలగింపుపై బీజేపీ నాయకుల ధర్నా



జెండాను పాతుతున్న జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో డివైడర్‌కు ఆనుకొని ఉన్న బీజేపీ జెండా దిమ్మెను శుక్రవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కార్యకర్తలతో కలిసి ఘటన స్థలానికి చేరుకొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కుర్చీలను విసిరేశారు. కమిషనర్ రాజయ్యతో వాగ్వావాదానికి దిగారు. అనంతరం బీజేపీ దిమ్మెను తొలగించిన స్థలంలోనే కొత్తగా దిమ్మె ఏర్పాటు చేసి జెండాను ఏర్పాటు చేశారు. అంతకుముందు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజయ్య బీఆర్‌ఎస్ నాయకుడిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ స్థలాలు పాలకులు ఆక్రమించుకుంటున్న కమిషనర్ పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దిమ్మె తొలగింపుపై బీజేపీ నాయకులు ఎస్‌ఐ బాలవెంకటరమణకు ఫిర్యాదు చేశారు. కమిషనర్‌ను వివరణ కోరగా అనుమతులు లేకుండా దిమ్మె ఏర్పాటు చేయడంతోనే తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సాయికృష్ణగౌడ్, కడ్తాల కృష్ణ, భరత్‌చంద్ర, కాశీపురం మహేష్, శివకృష్ణ తదితరులున్నారు.

ప్రజాస్వామ్యమా.. ఆటవికమా?

సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రాజెక్టులో భూమిని కోల్పోయిన రైతుకు పరిహారం దక్కకపోగా, ప్రజాప్రతినిధులు, అధికారుల వేధింపులతోనే నిర్వాసిత రైతు అల్లాజీ ఆత్మహత్యకు పాల్పడ్డారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారుల బెదిరింపులతోనే మనస్తాపానికి గురై అల్లాజీ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. అల్లాజీ కుటుంబసభ్యులు మూడు రోజులుగా మృతదేహంతో ఆందోళన చేపడితే అధికార పార్టీ నేతలు ఒక్కరు కూడా పరామర్శించకపోవడం దారుణమన్నారు. మృతుని కుటుంబానికి హామీ ఇచ్చినట్టుగా ఎకరాకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం, రూ. 5 లక్షల నష్టపరిహారం, మిగిలిన భూమిని కుటుంబానికే అప్పగించాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి చెందిన మహిళలపై పోలీసులు చేయిచేసుకోవడం దారుణమని మండిపడ్డారు. ఘటనను కవరేజ్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు దాడి చేయడం అప్రజాస్వామ్యం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రాజవర్ధన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మయ్య, బాచిరెడ్డి పాల్గొన్నారు.

యువకుడిపై లైంగిక వేధింపుల కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని ఈరట్వానిపల్లికి చెందిన కేతావత్ మహేష్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ఏఎస్‌ఐ సుజ్ఞానం వివరాల ప్రకారం గ్రామానికి వివాహిత కేతావత్ సునీతను మహేష్ నిత్యం వేధిస్తున్నాడు. బతుకుదేరువుకోసం సంగారెడ్డి జిల్లా జోగిపేటకు సునీత కుటుంబసభ్యులతో కలిసి వెళ్లింది. యువకుడు జోగిపేటకు తరుచుగా వస్తూ మహిళను వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. వేధింపులు భరించలేక బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా కేతావత్ మహేష్‌ను అదేగ్రామానికి చెందిన కేతావత్ హన్మంత్, సేవ్యా, హస్లీతోపాటు మొత్తం ఎనిమిది మంది గ్రామంలో కరెంట్ స్తంభానికి కట్టిసి దాడి చేశారని యువకుడి తండ్రి కేతావత్ నిరంజన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు



కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఐదోరోజు శుక్రవారం కొనసాగాయి. పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదించాలని డిమాండ్ చేశారు. నాయకులు కలమూరి కురుమయ్య, బచ్చలకూర లక్ష్మణ్, శీలం అగ్రస్వామి, వెంకటస్వామి, రాజమోళి, బత్తిని కురమయ్య తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



తెలకపల్లి: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నాయకుడు కూచుకుల్ల రాజేశ్ రెడ్డి అన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 4వ రోజు శుక్రవారం మండలంలోని జంగమోనిపల్లిలో గడపగడపకు కాంగ్రెస్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. అనంతరం గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుగ్గిల్ల ప్రకాష్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు భారీ బందోబస్తు

కల్వకుర్తి టౌన్: సీఎం సభకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథిగౌడ్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా ముఖద్వారం ప్రవేశం వద్ద నుంచి వెల్దండ మండలం రాఘయపల్లి మీదుగా ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో కొల్లాపూర్ చౌరస్తా వరకు పూర్తిస్థాయిలో నిఘా ఉంచామని వివరించారు. మొత్తం 320 పోలీసులు, డీఎస్పీలు, పదిమంది సీఐలు, ఇరవై మంది ఎస్‌ఐలు, 285 ఏఎస్‌ఐలు, పోలీస్ కానిస్టేబుల్, హోంగార్డులు విధులు నిర్వర్తించనున్నారని పేర్కొన్నారు. ప్రతి 100మీటర్లకు ఒక పోలీస్ కానిస్టేబుల్, చౌరస్తాలు, జంక్షన్‌ల వద్ద ఒక ఎస్‌ఐ స్థాయి అధికారి విధుల్లో ఉంటారని పేర్కొన్నారు.

కరాటేలో ప్రతిభ



పెద్దకొత్తపల్లి: మండలంలోని యాపట్ల గ్రామానికి చెందిన రాంచరణ్‌తేజ ఇటీవల జైపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను పొందాడు. గతేడాది ఢిల్లీ, ముంబైలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీలలో పాల్గొని బంగారు పథకాలు సాధించాడు. ఈ సందర్భంగా బాలుడు రాంచరన్ తేజను ఉపసర్పంచ్ అజయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు జహంగీర్, ప్రసాద్ రావులు అభినందించారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు



కల్వకుర్తి: పీఆర్‌ఎల్‌ఐ ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ రోడ్డు మార్గాన వెళ్లనుండటంతో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేశారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు జటప్రోలు, రామాపురం ప్రధాన రహదారుల పనులు చకచకా నిర్మించారు. సీఎం రాకతో రోడ్లకు మరమ్మతులు చేపట్టారు.

సభను విజయవంతం చేయండి

చారకొండ: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా కొల్లాపూర్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ నిర్మల విజేందర్‌గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు.

వెల్దండ: కొల్లాపూర్‌లో నిర్వహించే సీఎం బహిరంగ సభకు అధికసంఖ్యలో తరలిరావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. దారిపొడవునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి,పార్టీ అధ్యక్షుడు భూపతిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ జయప్రకాష్, భాస్కర్‌రావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ రాములు , ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

18న బేడబుడగ జంగాల సమావేశం



పెద్దకొత్తపల్లి: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బేడబుడగజంగాల ఐక్య వేదిక సమావేశాన్ని ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, కృష్ణయ్యలు తెలపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట విడుదల చేశారు. కార్యక్రమంలో యాదగిరి, నరహరి, భాస్కర్, వెంకటేష్, శేఖర్, నర్సింహ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని శాంతి నికేతన్ పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నేషనల్ ఇంజినీయర్స్ డే పురస్కరించుకొని విద్యార్థులకు గణితం, సైన్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు దాత కిషన్ సహకారంతో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బాదం రఘు, జిల్లా కార్యదర్శి లక్ష్మీనర్సింహ్మారావు, కిషన్, అశోక్, తదితరులు ఉన్నారు.